క్లుప్తంగా

అదృశ్యమైన బాలికను గుర్తించిన పోలీసులు

గండేపల్లి: అదృశ్యమైన బాలికను గుర్తించి ఆమెను తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని సూరంపాలెంకు చెందిన 19ఏళ్ల బాలిక సెప్టెంబర్ 30న అదృశ్యమైనట్టుగా పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక టీమ్‌గా ఏర్పడిన గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో కలిసి వెతికారు. నెల్లూరు జిల్లాలో ఆ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలియజేశారు.

ఇంటింటికీ ఆర్‌ఎస్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రముఖ్ మూర్తి

ఏలేశ్వరం: ఇంటింటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) తీసుకువెళ్లడమే లక్ష్యమని జిల్లా ప్రముఖ్ పైడిపల్లి సూర్యనారాయణమూర్తి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆదివారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని చిట్టచివరి గ్రామంలో హిందూ ధర్మం కోసం– దేశం కోసం పని చేసే హిందువులను కలవడమే ముఖ్య లక్ష్యమన్నారు. గ్రామస్థాయిలో ప్రతి హిందువును కలుసుకుని ఆర్‌ఎస్‌ఎస్‌ను బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఏనుగు సుబ్రమణ్యం, చిట్టంశెట్టి పుల్లయ్య, తోటరాఘవులు, గొల్లపూడి గణేష్, అలమండ దుర్గావెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



ఏలేశ్వరంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్థానికులు

ఏలేశ్వరం: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి సమీపంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన శివాజీని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఓటమి లేని నాయకుడిగా శివాజీ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. శివాజీ సాహసం నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్, స్థానికులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తయారు చేసేవారికి కచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. జనావాసాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఉంచరాదన్నారు. నివాస గృహాల్లో ఎక్కడైనా బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, తహసీల్దార్, పోలీసులు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. దుకాణాల ఏర్పాటుకు వీఆర్వో, పోలీసులు పరిశీలన చేసిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు మంజూరు చేస్తారన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



మరిడమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

పెద్దాపురం(సామర్లకోట): ప్రసిద్ధిచెందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశ మందిరంలో ఆలయ పండితులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

మట్టిని దోచుకుంటున్నారు..

- గ్రామాల్లో జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు
- అతి వేగంగా లారీల రాకపోకలు
- పాడైపోతున్న రహదారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కె.గోపాలపురం గ్రామస్తులు



కె.గోపాలపురంలో పొక్లెయిన్‌తో మట్టి తవ్వకాలు



కె.గోపాలపురంలో మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



ఎన్టీ రాజాపురం వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలను తాకుతున్న టిప్పర్ లారీ

గండేపల్లి: గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలూ, రాత్రి అని తేడా లేకుండా లారీల కెపాసిటీకి మించి మట్టిని తరలిస్తున్నారు. లారీలు అతి వేగంగా నడుపుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ వంటి ప్రభుత్వ కార్యాలయాలకు అతి సమీపంలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో గ్రామస్తులే లారీలను అడ్డుకున్నారు.

మండలంలోని కె.గోపాలపురంలో ఊరకొండను ఆనుకుని ఉన్న పొలం నుంచి గత కొన్ని రోజులుగా అక్రమంగా మట్టిని తవ్వి తరలించుకుపోతున్నప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు కులుకూరి రుద్రరావు, ఈరెటి కృష్ణ, గునుకుల బాపిరాజు తదితరులు చెబుతున్నారు. మట్టిని తరలిస్తున్న లారీలు గ్రామంలో ప్రధాన రహదారి నుంచి ఎన్టీ రాజాపురం మీదుగా హైవేని చేరుకుంటున్నాయి. లారీలు అతి వేగంగా వెళుతుండడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోందని ఆటో, ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. అంతేకాక లారీల వేగానికి రోడ్డుపై దుమ్ము, దూళి పైకి లేచి కళ్లల్లో పడుతోందని, ఊపిరి సరిగా తీసుకోలేకపోవడం వంటి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రహదారులు ఛిద్రమవుతున్నాయని, పెద్ద పెద్ద గోతులుగా ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. కె గోపాలపురం నుంచి ఎన్టీ రాజాపురం మీదుగా గండేపల్లి వచ్చేందుకు ఇదే మార్గమని, సుమారు 6 కిలోమీటర్లు ఉన్న రోడ్డు గోతులమయంగా మారడంతో అవస్థలు పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు వచ్చినా ఫలితం శూన్యం

ఇటీవల కొండపై నుంచి మట్టిని తరలిస్తున్న లారీ మోటారు సైకిల్‌పై వెళుతున్న స్థానికుడు చాగంటి నూకరాజును ఢీకొనడంతో ప్రాణనష్టం తప్పి స్వల్ప గాయాలతో బయటపడినట్టుగా గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు లారీలను అడ్డుకున్నారు. మట్టి తరలింపు దారులతో చర్చించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో రోడ్డుపై బైఠాయించారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు వచ్చి గ్రామస్తులతో మాట్లాడి లారీలను పంపించారు. దీనిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. అయితే గ్రామస్తులు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఎప్పటిలాగే లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మురారి, నీలాద్రిరావుపేట, తాళ్లూరు, మల్లేపల్లి తదితర గ్రామాల్లో గల పుష్కర, పోలవరం మట్టిని అడ్డు అదుపులేకుండా పగలు, రాత్రి తేడాలేకుండా తరలించుకుపోతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు
- డిజిటల్ బుక్ ఆవిష్కరణ



రౌతులపూడిలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల శ్రేణులు



ప్రత్తిపాడులో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అక్రమ కేసులు, అరాచకాలపై ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ‘డిజిటల్ బుక్‌’ను ప్రవేశపెట్టారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు అన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాయకులు భరోసా కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న వేధింపులు, అరాచకాలను, అక్రమాలను ఎండగట్టి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ కార్యకర్తలపై చేపడుతున్న వేధింపులు, అక్రమ కేసులు, అరాచకాలు ఈ డిజిటల్ బుక్‌లో నమోదవుతాయన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి అంశంపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఎవరైనా అధికార పార్టీ నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటే టోల్ ఫ్రీ నంబర్ 040–4917178 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ మండల నేతలు వాసిరెడ్డి భాస్కరాబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, మండల యువజన విభాగం అధ్యక్షుడు సోమరౌతు రాజా, రాష్ట్ర పార్టీ బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంటకరమణ, నియోజకవర్గం బీసీ విభాగం అధ్యక్షుడు సర్పం శ్రీను, ఎస్టీ విభాగం అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, జిల్లా పార్టీ నాయకులు అంకంరెడ్డి సతీష్, నాయకులు బండారు ఏసుబాబు, మానెం వీరబాబు, కేదారిశెట్టి నాగేశ్వరరావు, అచ్చిర్తి సాంబ, వడ్లశ్ల సత్యనారాయణ, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు కూటమి పార్టీ నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌కు సమాచారం అందిస్తే పార్టీ తరఫున న్యాయం జరిగేలా చూస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఆదివారం డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మండల పార్టీ కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెహరా దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు రక్షణ కల్పించడానికే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని చెప్పారు. కార్యకర్తలు అధికార పార్టీ నుంచి అన్యాయానికి గురైన, ఎటువంటి ఇబ్బందులు పడినా క్యూ ఆర్ కోడ్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా పనిచేద్దామని బెహరా దొరబాబు అన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు జువ్వల చినబాబు, జువ్వల బాబులు, ఏడిద రెడ్డినాయుడు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షుడు పినిశెట్టి ప్రకాష్, దేవ లక్ష్మణ్, గొల్లపల్లి దొరబాబు, కొప్పన గంగారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగిలా.. నడిచేదెలా..

- మురికి కూపంగా రహదారి
- అందులోనే పంచాయతీ కుళాయి, చేతిపంపు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



భీమవరపుకోట మాదిగపేటలో మురుగుకూపంగా మారిన రోడ్డు

కోటనందూరు: భీమవరపుకోట మాదిగపేటలో ఓ రహదారి మురుగుకూపంగా మారింది. ఈ ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపునీటితోపాటు ఇళ్లల్లో వాడకునే నీరు రోడ్డుపై చేరుతోంది. ఇలా చేరిన నీరు రెండు మూడు రోజులకు మురుగుకూపంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు, పందులు స్వైరవిహారం చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఇదే ప్రాంతంలో చేతిపంపుతో పాటు పంచాయతీ కుళాయి ఉంది.

పంచాయతీ కుళాయి నుంచి నీరు పట్టుకోడానికి కాని, చేతిబోరు నుంచి నీరు తోడుకోడానికి కాని అవకాశం లేకుండా పోయిందని పరిసర ప్రాంత నివాసితులు చెబుతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మురుగులో పందులు సంచరిస్తున్నాయని, దోమలు, ఈగలు పెరిగిపోయి అనారోగ్యాలబారిన పడుతున్నామని ఆ ప్రాంత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్ల క్రితం నుంచి ఉన్న డ్రైనేజీ వ్యవస్థను కొందరు మూసేయడంతో ఈ దుస్థితి ఏర్పడిందని, అన్నీ తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడుతున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మురుగుకూపంలోనే జీవనం



పరిసర ప్రాంతంలోని నీరంతా మా ఇంటిముందు వచ్చి చేరుతుంది. నీరు బయటకు పోయే మార్గం లేక ఇక్కడే నిల్వ ఉండి చెడువాసన వస్తుంది. మురుగునీటిలోనే కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు మురుగు సమస్యను పరిష్కరించాలి

– మిరియాల సుభద్ర, మాదిగపేట, భీమవరపుకోట

రోగాల బారిన పడుతున్నాం



రోడ్డుపై చేరిన మురుగుతో దోమలు, ఈగలు పెరిగిపోయి అనారోగ్యాల భారిన పడుతున్నాం. అసలే వ్యాధుల కాలం. ఆపై మురుగునీటితో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో ఎక్కడా లేని దుస్థితి మా మాదిగపేటలోనే ఎదుర్కొంటున్నాం. మంచినీరు పట్టుకునే పరిస్థితి కూడా లేదు.

– మోర్త చిట్టమ్మ, భీమవరపుకోట

సేవల కోసమే ‘లయన్స్’ ఆవిర్భావం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చిటినీడి, అమలకంటి తదితరులు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

- క్లబ్ ఉప గవర్నర్ శ్రీనివాసరావు

సామర్లకోట: పేద ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతోనే లయన్స్ క్లబ్ ఆవిర్భావం జరిగిందని క్లబ్ ఉప గవర్నర్ చిటినీడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత ఎముకలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. కైరా ఎమర్జెన్సీ అండ్ ట్రామా సెంటర్‌కు చెందిన వైద్యులు టి.వెంకటభార్గవ్, కర్రి నిరూప, సీహెచ్ అజయ్‌రాకేష్, నంబారు స్నేహ, ఆశా రమ్య శ్రీపాటి వైద్య పరీక్షలు చేశారు. పేద ప్రజలకు సేవలందించడంతో క్లబ్ సామర్లకోట శాఖ ముందజలో ఉందని ఉప గవర్నర్ అన్నారు. ప్రతి ఆదివారం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఎముకలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు, సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. వైద్య సేవలందించిన డాక్టర్లను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, రీజినల్ చైర్మన్ గంగాధరరావు, క్లబ్ కోశాధికారి ఏలేటి రమేష్, మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణరెడ్డి, శివనాగకృష్ణ, విజయకృష్ణ, విజయభాస్కరరెడ్డి, గండు శంకరరావు, బుర్రే కృష్ణమోహన్ తదతరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



రహదారిపై కూలిన చెట్టును తీస్తున్న వాహనదారులు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉష్ణోగ్రతల అధికంగా ఉండడంతో ప్రజలు ఎండ వేడికి ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో సేదతీరారు. వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శృంగవృక్షం గ్రామంలోని ప్రధాన రహదారిలో పెద్ద వృక్షం నేలకొరిగింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. స్థానికులు రహదారికి అడ్డంగా ఉన్న వృక్షాన్ని పక్కకు తొలగించడంతో రాకపోకలకు యథావిధిగా సాగాయి.

వైభవంగా కనకదుర్గమ్మ ఊరేగింపు

గోకవరం: గ్రామంలోని దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం వైభవంగా ఊరేగించారు. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రూ.50 లక్షలతో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు చేయించిన నూతన రథంపై అమ్మవారిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, డీజే నృత్యాలు, కాంతారా బొమ్మలు, అమ్మవారి గరగలు, వివిధ దేవతల వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ కన్నుల పండువగా ఈ ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల పరిశీలన

గండేపల్లి: తాళ్లూరు మఠంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి భూముల ఆదాయం పెంచేందుకు దేవదాయా శాఖ చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా మండల పరిధి ఎన్టీ రాజాపురంలోని 6.20 ఎకరాల భూమిని ఆదివారం తాళ్లూరు గ్రామస్తులు పరిశీలించారు. గతంలో ఈ భూమిని ఏడాదికి రూ.6 లక్షలకు వేలం పాటను దక్కించుకుని పాటల షరతు ముగిసినప్పటికీ శిస్తును పూర్తిగా చెల్లించలేదని దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో మంగళవారం ఉన్నతాధికారులు వచ్చి భూములను పరిశీలించి, 11 సంవత్సరాల కౌలుకు వేలం పాటలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. అప్పటి ఈఓ రాజేష్ ఇర్రిపాక, సీతారామపురం, తాళ్లూరు, మర్రిపాక, బూరుగుపూడి గ్రామాల్లోని భూములను స్వాధీనం చేసుకునేందుకు కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం ఈఓ శ్రీనివాస్ భూములు స్వాధీనానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీనిపై గ్రామస్తులకు ఈఓ శ్రీనివాస్‌ల మధ్య వాగ్వివాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. సక్రమంగా విధులు నిర్వహించే అధికారిని నియమించాలని వారు కోరుతున్నారు.

అమృత మంజరి రెండో భాగం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేంద్రరావు

కాకినాడ రూరల్: తమిళనాడుకు చెందిన మను జ్యోతి ఆశ్రమం కాకినాడ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అమృత మంజరి రెండో భాగం తన ప్రేమ గల చేతుల నైపుణ్యం అనే పుస్తక ఆవిష్కరణ ఆదివారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథి ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఒకే దేవుడు ఒకే దేశమనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ, భగవంతుడు ఒక్కడనే గొప్ప చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. వేద గ్రంథాలు, పురాణంలోని సారాంశాలను చిన్న పుస్తకాలుగా ముద్రించి, ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆశ్రమ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు లహరికృష్ణ, కేవీఆర్‌ఎల్ ప్రభాకర్ రావు, రిటైర్డ్ ఆర్‌ఎస్సై కేవీ రమణ, జె.రామారావు, నారాయణ పాల్గొన్నారు.

పిఠాపురం రాజా ఆశయాలు కొనసాగించాలి



పిఠాపురం రాజా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బాలాజీచెరువు: విద్యా దాత పిఠాపురం రాజా 140వ జయంతి సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందించాలని సదుద్దేశంతో పిఠాపురం రాజా తన ఆస్తిపాస్తులను విద్యా సంస్థలకు కేటాయించడం అభినందనీయమన్నారు. పిఠాపురం రాజా స్కూల్, కళాశాలల్లో సుమారు ఏడు వేల మంది విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాలకులు, యాజమాన్యాలు పిఠాపురం రాజా ఆశయాలు కొనసాగించాలని కోరారు. పీఆర్ విద్యాసంస్థలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్ష, కార్యదర్శులు వాసు, సాయి, నాయకులు సత్యం, అమల, తేజ, బేస్సి, లోవరాజు, నాని, మణికంఠ, ఆదర్శ్, కరుణ్, గమినివేల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కల్వర్ట్



ప్రధాన రహదారిలో కూలిపోయిన కల్వర్ట్‌పై శ్లాబ్ రాయి

శంఖవరం: పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే గ్రామంలోని ప్రధాన రహదారి ప్రమాదభరితంగా ఉంది. రోడ్డు మధ్యలోని కల్వర్ట్‌పై ఉన్న శ్లాబ్ రాయి(సిమెంట్ బిళ్లలు) కూలిపోయింది. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక శివాలయం వద్ద కల్వర్ట్‌పై శ్లాబ్ రాయి లేక గొయ్యి ఏర్పడింది. ఈ గొయ్యిలో పడి చాలా మంది ప్రమాదానికి గురవుతున్నారు. ఈ శంఖవరం నుంచి కత్తిపూడి, రౌతులపూడి, జి.కొత్తపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డులో నుంచి వెళ్లాలి. రైతులు తమ పొలాలకు ఇలా వెళుతుంటారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కల్వర్ట్‌పై శ్లాబ్ రాయి వేయాలని స్థానికులు కోరుతున్నారు.